


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 177 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | సోమవారం 17 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

# పరకాల వేదికగా రూ. 424 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

- మొదటి ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలోనే మిగిలిన ఖాళీలూ భర్తీ చేస్తామని వెల్లడి.
- పరకాల నియోజకవర్గంలో రూ. 424 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు.
- బోల్తా కొట్టిన బండిని పట్టాలెక్కించాం.. ఇక పరుగులెత్తించడమే తరువాయి : సీఎం రేవంత్ రెడ్డి.
- సెప్టెంబర్ అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరై సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ పిలుపు.





**నేటి శుభోదయ, పరకాల :** రాష్ట్రంలో నిరుద్యోగ యువకులను కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హితవు పలికారు. ప్రజా పాలన – ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పరకాల నియోజకవర్గంలో దాదాపు రూ. 424 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రైతు, మహిళ, యువత సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం అన్ని సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తోందని, అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇటీవలే పోలీస్ నియామకాల్లో వయోపరిమితి సడలించామని, రాబోయే రోజుల్లో విడతలవారీగా మిగిలిన అన్ని ప్రభుత్వ ఖాళీలనూ భర్తీ చేసి యువత కలలను సాకారం చేస్తామని స్పష్టం చేశారు. అప్పుల భారం ఉన్నప్పటికీ బోల్తా కొట్టిన బండిని పట్టాలెక్కించామని, ఇక పరుగులెత్తించడమే మిగిలిందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో జరిగే శాసనసభ సమావేశాలకు ప్రతిపక్ష నాయకుడు కె. చంద్రశేఖర్ రావు హాజరై అభివృద్ధి, సంక్షేమంపై సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



## టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

### వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!




- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- 6 నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు ప్లాన్
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం
- వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి : ఉత్తమ్

- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



**నేటి శుభోదయ, సూర్యాపేట :** స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు...

2

## కల్తీకి చెక్.. తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు.. ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు



- ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- 'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం
- ఆహార, ఔషధాల కల్తీని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం

2

## రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు..

### కాగ్ నివేదికతో రంగంలోకి దిగిన కేంద్రం

- రైల్వే స్టేషన్లలో కలుషిత తాగునీటిపై కాగ్ నివేదికతో కేంద్రం అప్రమత్తం
- మంత్రి అశ్విని వైష్ణవ్ ఉన్నతస్థాయి సమీక్ష.. తక్షణ చర్యలకు ఆదేశం
- హైదరాబాద్ సహా 8 స్టేషన్ల నీ... కొలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తి...

2



## బెంగాల్ రాజకీయాల్లో కలకలం..

### పార్టీ ఆఫీస్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన మాజీ డిప్యూటీ స్పీకర్

- పశ్చిమ బెంగాల్ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ అనుమానాస్పద మృతి
- బీర్భూమ్ జిల్లాలోని పార్టీ కార్యాలయంలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన వైనం
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన టీఎంసీ సీనియర్ నేత
- ఇటీవలి ఎన్నికల్లో ఓటమి, పార్టీ పదవికి రాజీనామా

2



# మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి : ఉత్తమ్

**మొదటిపేజీ తరువాయి..** రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బెంగాల్ రాజకీయాల్లో కలకలం.. పార్టీ ఆఫీస్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన మాజీ డిప్యూటీ స్పీకర్

**మొదటిపేజీ తరువాయి..** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధ్రువ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

# శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక...

## నవంబర్ నెల సేవా టికెట్ల షెడ్యూల్ విడుదల



**నేటి శుభోదయ, తిరుమల :** 2026 నవంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, దర్శన టోకెన్లు, వసతి గదుల ఆన్‌లైన్ కోటా విడుదల షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. భక్తులు ఈ తేదీలను గమనించి, టిక్కెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ డిమాండ్ ఉండే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) విధానంలో టికెట్లను కేటాయించనున్నారు. ఇందుకోసం భక్తులు ఆగస్టు 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు ఆగస్టు 22వ తేదీ మధ్యాహ్నంలోగా నిర్ణీత రుసుము చెల్లించి తమ టిక్కెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవా టికెట్లను ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయి. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను టీటీడీ విడుదల చేస్తుంది. ఆగస్టు 24న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఇక ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

# కల్తీకి చెక్.. తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు..

## ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పని చేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.

'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం–1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది.

ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

# రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు.. కాగ్ నివేదికతో రంగంలోకి దిగిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు.

ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో "ట్యాంక్ టూ ట్యాప్" వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు.

**కాగ్ నివేదికలో కీలక అంశాలు**

దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్–సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల పరిధిలోని ఎనిమిది స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ కొలి (E. coli)' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. 'ఇ కొలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భీవండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి.

ఇదే నివేదికలో మరో కీలకమైన విషయాన్ని కాగ్ బయటపెట్టింది. సర్వే చేసిన 512 స్టేషన్లలో 458 స్టేషన్లు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యాయని పేర్కొంది. 2018 ఆగస్టు 31 నాటికే అన్ని స్టేషన్లలో ఈ సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. కాగ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నాల్లో భాగంగానే తాజా చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

# తెలంగాణాలో కొత్త స్కీమ్.. వారికి రూ. లక్షన్నర సబ్సిడీ!

- **18,766 పాత ఇంధన ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా**
- **ఎలక్ట్రిక్ ఆటో కన్వర్షన్ కు రూ.1.50 లక్షల సబ్సిడీ**
- **16 వారాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన రవాణా శాఖ**
- **డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సబ్సిడీ**



**నేటి శుభోదయ, డెస్క్ :** హైదరాబాద్ నగరంలో పర్యావరణ కాలుష్యం రోజు రోజుకూ పెరిగిపోతుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించి హరిత రవాణాను ప్రోత్సహించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్–2026కు ఈ క్రమంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లోని పొల్యూషన్ కు కారణం అవుతున్న పెట్రోల్, డీజిల్ ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చనున్నారు. మొదటి దశలో సుమారు 18,766 పాత ఇంధన ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం అర్హులైన ఆటో డ్రైవర్లకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఎలక్ట్రిక్ ఆటో పైన లక్షా 50 వేల రూపాయల సబ్సిడీ లభిస్తుంది. ఈ పథకం ద్వారా నగరంలో పొల్యూషన్ తగ్గుతుంది. ఇంధన ధరల భారం నుంచి డ్రైవర్లకు ఉపశమనం లభిస్తుంది. ఇందులో లబ్ధిదారులకు రెండు ఆప్షన్లు అందుబాటులో ఉంచారు. పాత పెట్రోల్ లేదా డీజిల్ ఆటోలో ప్రభుత్వం ఆమోదించిన ఎలక్ట్రిక్ కన్వర్షన్ కిట్ అమర్చుకోవచ్చు. లేదా పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేయవచ్చు. రెండు ఆప్షన్లలోనూ రూ.1.50 లక్షల సబ్సిడీ వర్తిస్తుంది. కన్వర్షన్ కిట్ల సాంకేతిక ప్రమాణాలు, వాహన భద్రత, బ్యాటరీ లైఫ్‌పైన కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. ఈ పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేయడానికి రవాణా శాఖ 16 వారాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. తొలి 8 వారాల్లో ఆటో యూనియన్లతో అవగాహన సదస్సులు నిర్వహించనుంది. ఆపై ప్రామాణిక కిట్ల తయారీ సంస్థల ఎంపిక, ధరల స్థిరీకరణ జరుగుతాయి. 8వ వారం నాటికి ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వస్తుంది. దరఖాస్తు, అర్హతల ధ్రువీకరణ, ఆర్‌టీవో వెరిఫికేషన్ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

## సదాశివపేటలో ఘనంగా ఫుట్‌బాల్ టోర్నమెంట్



**సంగారెడ్డి, ఆగస్టు 16, నేటి శుభోదయ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సదాశివపేటలో ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఊషు అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముజీబ్ సహకారంతో, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ సమక్షంలో ఈ టోర్నమెంట్ నిర్వహించబడింది.టోర్నమెంట్‌లో వివిధ జట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ , 17వ వార్డు కౌన్సిలర్ సజ్జి హాజరై విజేతలు, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సజ్జి మాట్లాడుతూ, సదాశివ పేటలో క్రీడాకారుల కోసం స్టేడియం నిర్మాణానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రస్తుత కాలంలో చిన్న వయస్సులోనే అనేక మంది గుండె సంబంధిత సమస్యలకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మన్సూర్ అహ్మద్ జట్టును ముఖ్య అతిథులు అభినందించారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన అరుణ్ జట్టును కూడా అభినందించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా యువతను క్రీడల వైపు ప్రోత్సహించే విధంగా మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రహమత్ అలీ, సలావుద్దీన్, మహేష్, చిన్న, విట్టల్, కాజా, వినోద్, శ్రీనివాస్, సాయి తదితరులు, క్రీడాకారులు, విద్యార్థులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.క్రీడలు – ఆరోగ్యం – క్రమశిక్షణ – యువత భవిష్యత్తుకు బలమైన పునాది అనే సందేశంతో ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది.

## క్లాస్ ఫస్ట్ లో ప్రతిభ కనబరిచిన బజార్ నవదీప్.



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి అనంతరెడ్డి మాట్లాడుతూ, ఇలాంటివి ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని ఆయన కోరారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని నిరూపించాలి ఆయన హర్షం వ్యక్తం చేశారు. కన్న తల్లిదండ్రులకు సమాజానికి మీ తెలివితేటలు మీ మేధస్సు ఉన్న ఊరుకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.80 వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఎలిమినేడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు క్లాస్ ఫస్ట్ 1,116 రూపాయలు మనీ ప్రైస్ గా ఇచ్చారు.అండ్ సెకండ్ విద్యార్థులకు నగదు చొప్పున బహుమతి ఇవ్వడం జరిగింది.ఇట్టి విషయానికి గ్రామస్తులు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఖమ్మం లో అరాచకాలను ప్రోత్సహిస్తున్న మంత్రి తుమ్మల

### - ఘూటు విమర్శలు చేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘాటుగా విమర్శించారు. గతంలో తనపై 'కాశీం రజ్వీ' అంటూ తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులు ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆయన కుమారుడి వెంట ఉంటూ ఇసుక, మట్టి, భూ అక్రమాలకు పాల్పడుతున్నారని పువ్వాడ మండిపడ్డారు.ఆదివారం జరిగిన ఖమ్మం నగర ఖానాపురం హవేలి పరిధి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బీఆర్ఎస్ పార్టీతోనే కార్యకర్తలు ఉన్నారని, పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఎవరి ఉడత ఊపులకు భయపడేది లేదని, తగిన సమాధానం చెప్పేలా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే విధంగా ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నడూ 'జై తెలంగాణ' అనని తుమ్మలను కేసీఆర్ మంత్రిని చేశారని అన్నారు. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవిని అనుభవించారని, అయితే ఖమ్మం ప్రజలకు ఆయన చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు.తాను ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మం నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. సోషల్ మీడియాలో పువ్వాడ అజయ్ కుమార్ పేరు కనిపిస్తే కొందరు ఉబలాట పడుతున్నారని ఆయన విమర్శించారు. పాత కాంగ్రెస్ కంటే కొసరు కొత్త కాంగ్రెస్ నాయకులే ఎక్కువ హడావుడి చేస్తున్నారని, ఇదే విషయాన్ని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని పేర్కొన్నారు.సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ కూలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజాధనంతో చేపట్టిన ఇలాంటి భారీ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన దేవరపల్లి–ఖమ్మం జాతీయ రహదారికి క్రెడిట్ తీసుకునేందుకు ప్రచారం చేసుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరాటపడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన రహదారిని తన ఘనతగా చూపించుకునేందుకు షో చేసేలా ప్రయత్నించడం సరికాదన్నారు. ఆ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోజుకో ప్రమాదం చోటు చేసుకుంటున్నప్పటికీ ప్రజల భద్రతపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పువ్వాడ తెలిపారు. వాటికి నిధులు విడుదల చేసి, జీవోలు జారీ చేసింది నాటి కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. మున్నేరు వరద బాధితులకు శాశ్వతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టామని చెప్పారు.ఖమ్మం బస్టాండ్‌ను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే, దానిపై అనేకమంది విమర్శలు చేశారని అన్నారు. గోళ్లపాడు చానల్‌ను సుందరంగా తీర్చిదిద్దింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలన అట్టర్ ఫ్లాప్ సినిమా లాగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## ఖమ్మం జిల్లా తల్లాడ చిన్నారి మృతికి బీసీ హక్కుల సాధన సమితి అశ్రు నివాళి



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** జూన్ నెలలో ఖమ్మం జిల్లా తల్లాడ ప్రాంతానికి చెందిన రజక కుటుంబానికి చెందిన 12 సంవత్సరాల చిన్నారి తేజస్విని పై అత్యాచారం చేసి హత్యాయత్నం నుంచి తప్పించుకున్న చిన్నారి నిన్నటి రోజున ఫిజియోథెరపీ పొందుతూ మరణించడాన్ని అత్యంత బాధాకరమైన సంఘటనగా భావిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రకటించారు. ఆదివారం హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం బీసీ ముఖ్య నాయకులతో కలిసి చిన్నారి తేజస్వినికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక ఉన్మాది చేతిలో అభం శుభం తెలియని చిన్నారి దుర్మరణం పాలయ్యిందని సభ్యసభమాజం తలవంచుకునేలా జరిగిన ఈ సంఘటనను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని, ప్రభుత్వం కూడా తగు రీతిలో స్పందించలేదని ఆ జిల్లాకు చెందిన ఒక డిప్యూటీ సీఎం తో పాటు ఇద్దరు క్యాబినెట్ మినిస్టర్లు ఉండి కూడా ఆ అమ్మాయి కేవలం ఐదు లక్షలు రూపాయలు ఇచ్చి చేతులు దులుపుతున్నారని తక్షణమే ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించి ఆర్థికంగా అండగా ఉండాలని ఎన్ని కోట్లు ఇచ్చినా ఆ కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందనే విషయాన్ని అందరూ ఒప్పుకోవాల్సిందేనని తెలిపారు. ఆ అమ్మాయి గాయపడిన సందర్భంగా నిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర బృందం పరామర్శించి రాష్ట్ర ముఖ్యమంత్రి కి మంత్రి సీతక్కకు బహిరంగ లేఖలు రాసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చిన్నారి తేజస్వినికి నివాళులర్పించిన వారిలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్ దశరథ, బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అంబటి బాపురాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధీటి నరసయ్య, మనోహరాచారి, నరసమ్మ, నార్కెట్ పల్లి మండల సెక్రెటరీ శ్రీనివాస్ ఉన్నారు.

## నూతన విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం గ్రామ పరిధిలో విద్యుత్ అధికారులకు మంగాపురం తండాలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను గ్రామ సర్పంచ్ అశోక రాణి చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యుత్ వ్యవస్థలో నూతనంగా వచ్చినటువంటి యూనిఫామ్ సర్వీస్ లైన్స్ పద్ధతి ద్వారా నూతనంగా 11 కెవి, 25 కేవిఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగినది, విద్యుత్ శాఖ వారిచే త్వరితగతిన పని పూర్తయినందుకు ధీరావత్ పుష్పావతి చాలా సంతోషాన్ని వ్యక్త పరచడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో ఖమ్మం డివిజనల్ ఇంజనీర్ టి. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కూసుమంచి పి . వెంకట్, నేలకొండపల్లి మండల విద్యుత్ అధికారి జీ .రవి, మంగాపురం తండా లైన్ ఇన్స్పెక్టర్ షేక్ దావూద్, లైన్ మెన్ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఇట్టి పనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ అశోక రాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంట్రాక్టర్ అశోక్ నాయక్, ఇతర సిబ్బంది కూడా ఈ సన్మాన కార్యక్రమంలో పాలొన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాదు విద్యుత్ డి ఈ పవర్ కోటేశ్వరరావు, నేలకొండపల్లి మండల నాయకులు – చెరువు మాధవరం మత్స్య పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షులు రాధా కృష్ణమూర్తి, పాటు ఇతర విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పవర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అందిస్తున్నటువంటి సర్వీసును ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు, కొత్తగా విద్యుత్ కనెక్షన్ కావాలని అనుకునేవారు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ యాజమాన్యానికి విద్యుత్ వినియోగదారులు, కొత్తగా కనెక్షన్ కావాలని కోరుకునే వారికి త్వరితగతిన స్పందించి వారి సర్వీస్లను మంజూరు చేస్తున్న విషయాన్ని కొనియాడుతూ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని కలిసి సన్మానించిన వెలుగుమట్ల భుదాన్ బాధితుల సంఘం



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగుమట్ల భుదాన్ భూముల్లో ఇళ్ళను నిర్దాక్షణ్యంగా కూల్చివేసి రోడ్డున పడేసి జైళ్ళలో పెట్టిన వారికి బాధితులకు అండగా నిలబడి భోజనం, మంచినీళ్లు, మెడికల్ క్యాంపులు పెట్టి ఆదుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి బాధితుల సంఘం కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇళ్ళు కోల్పోయిన బాధితుల తరపున పోరాడి మరలా ప్రభుత్వం దిగివచ్చి ప్లాట్లు ఇచ్చేవరకు అండగా ఉన్నందుకు ధన్యవాదములు తెలిపారు. మరలా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఇళ్ళు కోల్పోయిన వారికి పక్క ఇళ్ళు నిర్మించి ఇస్తామని పువ్వాడ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు.

## నాగసాయికి వందే భారత్ అవార్డ్



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మంకు చెందిన ప్రముఖ భక్తిగీతాల గాయకుడు రాయల నాగసాయి ప్రతిష్టాత్మక వందే భారత్ జాతీయ సమైక్యతా అవార్డ్ -2026 అందుకున్నారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళారత్న మూవీ బ్యానర్,ఆనంద లహరి సాంస్కృతిక కళాసేవ సంస్థ,వంశీ రామరాజు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు,కళాబ్రహ్మ వంశీ రామరాజు,సినీ నటులు జెన్ని,బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి,వందే భారత్ చిత్ర దర్శకులు ,కళారత్న మల్లం రమేష్ చేతులమీదుగా నాగసాయి ఈ అవార్డునందుకున్నారు.ఖమ్మంలోని కళా సంస్థలు,కళాకారులు ఈ సందర్భంగా సాయిని అభినందించారు.

## గాయని మాలతికి వంశీ వందే భారత్-2026 పురస్కారం



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం గాయని వంజా మాలతినాయుడు వంశీ వందే భారత్-2026 పురస్కారం అందుకున్నారు.శుక్రవారం హైదరాబాద్ కూకట్ పల్లిలోని ప్రకాశ స్టూడియోలో జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో కళాబ్రహ్మ వంశీ రామరాజు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## సింగర్ వెంకట్ కుమార్ కు వంశీ వందేభారత్ పురస్కారం



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** గాయకుడు, ఈవెంట్స్ ఆర్గనైజర్ వెంకట్ కుమార్ ప్రతిష్టాత్మక వంశీ వందేభారత్-2026 పురస్కారం పొందారు.శుక్రవారం హైదరాబాద్ లోని ఓ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో వంశీ సంస్థ వ్యవస్థాపకులు వంశీ రామరాజు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

## వైద్య శిబిరం విజయవంతం





**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 47వ డివిజన్లో కాంగ్రెస్ నాయకులు ఎస్ కే జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం సుమారు 150 మంది వైద్య సేవలను అందించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణి చేశారు.

## 22 నుంచి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

- **టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ నిర్ణయం**
- **సుబ్లేడులో షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభం**
- **నియోజకవర్గాల వారీగా కొనసాగనున్న యాత్ర**
- **విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి పిలుపు**

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం ఈనెల 22వ తేదీ నుంచి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ - 2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా పాదయాత్ర నిర్వహించాలని తలపెట్టినట్లు చెప్పారు. నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన జర్నలిస్టు, కవి షోయబుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని ఆయన విగ్రహం వద్ద నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. సుబ్లేడులో మొదలయ్యే ఈ పాదయాత్ర అక్కడి నుంచి నేరుగా తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండల కేంద్రాలతో పాటు ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలో కొనసాగుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని జర్నలిస్టులతో కలిసి సాగే ఈ పాదయాత్రకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. ఇళ్ల స్థలాల సాధన కోసం నియోజకవర్గాల వారీగా సాగే ఈ పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

## గట్టుసింగారం డబుల్ బెడ్ రూమ్ వాసుల సమస్యలు పరిష్కరించండి



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండల పరిధిలోని గట్టుసింగారం డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో లగిశెట్టి వీరబాబు, షేక్ అలీ ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది. అక్కడ వారిని అనునిత్యం, డ్రైనేజీ, త్రాగు నీరు సమస్య, సీసీ రోడ్లు లేకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఎక్కడో ఊరికి దూరంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీ ఉండటం వలన వారిని పట్టించుకునే నాధుడే లేకపోవడం విచారకరం. ముఖ్యంగా కేజీబీవీ నుండి వస్తున్న మురుగు నీరు వారి ప్రధాన సమస్య కేజీబీవీ నుండి నేరుగా మురుగు నీరు స్థానిక బెడ్ రూమ్ కాలనీ ముందు నుండి ప్రవహించడం వలన అత్యంత దారుణంగా దుర్వాసన వస్తున్నోది. దాని వలన దోమలు పెరగడమే కాక అనేక అ రోగాలతో డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు బాధపడుతున్నారు .ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న 20 కుటుంబాలు దుర్వాసనతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనడం పాటు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించిన పరిష్కారం చూపించక పోవడం పేదల పట్ల వారికున్న వైఖరిని తెలియజేస్తుంది. దయచేసి కేజీబీవీ నుండి వస్తున్న మురుగు నీరును మళ్లించ వలసిందిగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా అక్కడ డ్రైనేజీ సమస్యను త్రాగునీరు సమస్యను పరిష్కరించి, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టవలసిందిగా కోరుచున్నారు. పర్యటనలో బిజెపి యువమోర్చా నాయకులు మంద చంద్రశేఖర్ గౌడ్, స్థానికులు బొజ్జ రమేష్ , గుంటూరు రమేష్ ,పావురాల శీను , కడారి జ్యోతి లోడిగ జానయ్య బి లలిత, రెడ్డబోయిన లింగమ్మ, ధారా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును పరిరక్షించాలి

### - మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ వేగంగా కొనసాగిందని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడమే బిఆర్ఎస్ ముఖ్య ఉద్దేశమని మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు.ఖమ్మం ఖానాపురం హవేలీ బిఎల్ఏల ఆత్మీయ సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఖమ్మం నియోజకవర్గంలో పార్టీ బీఎల్ఏలు, నాయకులు క్షేత్ర స్థాయిలో చురుగ్గా వ్యవహరిస్తూ విశేషమైన కృషి చేసారని ఆయన వెల్లడించారు.క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమించి, నియోజకవర్గంలోని ప్రతి నివాసాన్ని పరిశీలించి బిఎల్ఏ ఐడీ కార్డులతో బాధ్యతాయుతంగా పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో ఒకప్పుడు దాదాపు 3,28,000 ఓట్లు ఉండేవని, సవరణ ప్రక్రియ నాటికి అవి సుమారు 2,48,000కు చేరాయని పేర్కొన్నారు. దాదాపు 80,000 పైగా ఓట్ల మార్పు జరిగింది. మారే రాజకీయ గాలివాటాలను బట్టి కొందరు అటుఇటు మారినప్పటికీ, కేసిఆర్ నాయకత్వంపై, బిఆర్ఎస్ సిద్ధాంతాలపై నమ్మకంతో నిలబడిన నిజమైన కార్యకర్తలే పార్టీకి అసలైన బలం. ఊహాగానాలకు, పుకార్లకు తావులేకుండా ఖమ్మం నియోజకవర్గంలో బిఆర్ఎస్ బలం ఏమాత్రం తగ్గలేదని, రాబోయే రోజుల్లో ప్రతి బూత్ స్థాయిలో కమిటీలను మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు.పార్టీ నాయకులు, శ్రేణులు ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను చివరి వరకు పర్యవేక్షించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు. గతంలో తనపై కాశీం రజ్వీ అంటూ తప్పుడు ప్రచారం చేసిన వారు, ప్రస్తుతం తుమ్మలతో పాటు ఆయన కుమారుడి పక్కన ఉంటూ అరాచకాలకు పాల్పడుతున్నారు. ఖమ్మం బస్స్టాండ్ను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే, దానిపై అనేకమంది విమర్శలు చేశారు గోళ్లపాడు చానల్ను సుందరంగా తీర్చిదిద్దాం. మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది వాటికి నిధులు విడుదల చేసి, జీవోలు జారీ చేసింది మున్నేరు వరద బాధితులకు శాశ్వతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నాం. ఇసుక, మట్టి, భూములు దోచుకంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బీఆర్ఎస్ పార్టీతోనే కార్యకర్తలు ఉన్నారు పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగింది ఖమ్మం అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే విధంగా ఏం చేశారు. తాను ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తాను అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మం నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది.సోషల్ మీడియాలో పువ్వాడ అజయ్ కుమార్ పేరు కనిపిస్తే కొందరు ఉబలాటపడుతున్నారు.సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ కూలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన నేషనల్ హైవే దేవరపల్లి–ఖమ్మం జాతీయ రహదారికి క్రెడిట్ తీసుకునేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరాటపడుతున్నారు అని ఏద్దేవా చేశారు.కార్యక్రమంలో నాయకులు కూరాకుల నాగభూషణం,బచ్చు విజయ్ కుమార్,పగడాల నాగరాజు,కర్నాటి కృష్ణ,భీరెడ్డి నాగచంద్ర రెడ్డి,నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు,దండా జ్యోతి రెడ్డి,బిక్కసాని జస్వంత్,బత్తుల మురళి,దేవభక్తిని కిషోర్,వంకుడోత్ సురేష్,కందాల వీరేందర్ గౌడ్,వల్లభనేని రామారావు, షకీనా,గాదె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మధిరను 'కమిషన్ల మధిర'గా మార్చేస్తున్నారా..?

- ఔటర్ రింగ్ రోడ్డు ఎవరి కోసం? ప్రజల కోసమా, కమిషన్ల కోసమా...?
- భవిష్యత్ లో రోడ్డున పడనున్న మధిర వ్యాపారస్తులు
- అభివృద్ధి పేరుతో విధ్వంసం వద్దు, రైతులు, వ్యాపారుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
- మధిరకు ఓఆర్ఆర్ అవసరమేమిటి...?
- భట్టి ప్రజలకు సమాధానం చెప్పాలి : లింగాల కమల్‌రాజు







**ఖమ్మం, కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఒకప్పుడు చరిత్ర, త్యాగాలు, విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మధిరను నేడు 'కమిషన్ల మధిర'గా మార్చే పరిస్థితి తీసుకొచ్చారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తీవ్రస్థాయిలో విమర్శించారు. మధిరలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా, మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "మధిరకు ఔటర్ రింగ్ రోడ్డు ఎందుకు? ప్రజల కోసమా.. కమిషన్ల కోసమా?" అని ప్రశ్నించారు. మధిర చుట్టూ ఓఆర్ఆర్ నిర్మాణంతో పట్టణంలోకి వచ్చే వాహనాలు తగ్గిపోతే చిరు, చిన్న వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**- "చిరు వ్యాపారుల పొట్ట కొట్టే అభివృద్ధి ఎవరి కోసం...?"**

రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారుల ర్యాంపులు, బ్లెంపులు, సన్‌సైడ్లు, బోర్డులు తొలగించారని, వాటిని తిరిగి ఏర్పాటు చేసుకోవడానికి ఒక్కో వ్యాపారికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు భారం పడుతోందని కమల్‌రాజు అన్నారు. సామాన్యుల నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తూ అధికార పార్టీ కార్యాలయం విషయంలో మాత్రం ఎందుకు అదే నిబంధనలు అమలు చేయలేదని ప్రశ్నించారు.

**- "ఖమ్మంకే లేని ఓఆర్ఆర్, మధిరకే ఎందుకు...?"**

విజయవాడ, ఖమ్మం, వరంగల్ వంటి నగరాలకు లేని ఔటర్ రింగ్ రోడ్డు మధిరకు ఎందుకు అవసరమని కమల్‌రాజు నిలదీశారు. ఓఆర్ఆర్ వల్ల మధిరకు వచ్చే వాహనాలు పట్టణంలోకి రాకుండా నేరుగా వెళ్లిపోతే టీ దుకాణాలు, హోటళ్లు, వస్త్ర దుకాణాలు, ఇతర చిరు వ్యాపారాల ఆదాయంపై ప్రభావం పడుతుందని అన్నారు.
ఓఆర్ఆర్ పేరుతో వందల ఎకరాల వ్యవసాయ భూములు సేకరిస్తున్నారని, రైతులకు మార్కెట్ విలువకు తగిన పరిహారం అందించకుండా భూములు తీసుకుంటే తీవ్ర అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. "రైతుల భూములను తీసుకుని వారికి న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు" అని హెచ్చరించారు.

**- "ప్రజల కోసం అభివృద్ధి అయితే మేము చెప్పిన పనులు చేయండి"**

ఓఆర్ఆర్ కు కేటాయిస్తున్న నిధులతో మధిరకు వచ్చే ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేసి పట్టణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపడితే చిరు వ్యాపారాలకు ఉపాధి పెరుగుతుందని అన్నారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మధిరలో నిర్మించిన రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, ట్యాంక్‌బండ్, ఆస్పత్రి, మార్కెట్, చెక్‌డ్యామ్ తదితర అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ.. "మేము చేసిన అభివృద్ధిని చెప్పుకోవడం కాదు. దాన్ని మరింత మెరుగుపరచి చూపించాలి" అని అన్నారు.

**- "ఓఆర్ఆర్ ఎందుకోసం వస్తుందో భట్టి ప్రజలకు వివరించాలి"**

మధిర చుట్టూ ప్రతిపాదిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు ఉద్దేశం, భూముల సేకరణ, రైతులకు అందించే పరిహారం, పట్టణ వ్యాపారాలపై పడే ప్రభావంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కమల్‌రాజు డిమాండ్ చేశారు.
"మధిరలోకి ప్రజలు రాకుండా చేసే అభివృద్ధి మాకు అవసరం లేదు. ప్రజలు మధిరకు వచ్చేలా, వ్యాపారాలు పెరిగేలా అభివృద్ధి చేయాలి" అని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల భవిష్యత్తును, రైతుల భూములను, వ్యాపారుల ఉపాధిని దెబ్బతీయవద్దని సూచించారు.

ప్రజలు ప్రశ్నించడం మానేస్తే ఏకపక్షంగా పనులు కొనసాగించే ప్రమాదం ఉందని, మధిర ప్రజలు, రైతులు, వ్యాపారులు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓఆర్ఆర్ తో భూములు కోల్పోయే రైతులకు, వ్యాపారుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి పోరాటం చేస్తుందని లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు.

ఈ సమావేశములో లింగాల కమల్ రాజు గారితో పాటుగా చిత్తారు నాగేశ్వరరావు, బిక్కి కృష్ణ ప్రసాద్, యన్నంశెట్టి వెంకట అప్పారావు, అరిగే శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు బొగ్గుల భాస్కర్ రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బొగ్గుల వీరారెడ్డి, పరిశ శ్రీనివాసరావు, ఆళ్ల నాగబాబు, చీదిరాల రాంబాబు, షేక్ సైదా, వెంపటి నాగేశ్వరరావు, నాగులవంచ రామారావు, లంకమళ్ళ నాగేశ్వరరావు, అబ్బూరి రామన్, ధిల్లు, గుగులోత్ కృష్ణ నాయక్ తదితరులు ఈ విలేకరుల పాల్గొన్నారు

# ఆరోపణలు నిరూపిస్తే భూములు పేదలకు ఇస్తా

## ఆధారాలు లేకుండా సీఎం పేరెత్తే అర్హత లేదు: తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడ్చల్ మల్కాజ్గిరి, ఆగస్టు 16, నేటి శుభోదయ** తనపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్ నాయకులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ చేస్తున్న భూకబ్జా ఆరోపణలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. శామీర్‌పేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని వజ్రేష్‌యాదవ్ సవాల్ చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును ప్రస్తావించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వంపై, కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేసే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉన్నప్పటికీ, ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచిది కాదన్నారు.ఆస్తుల వివరాలు బహిర్గతం చేస్తా2005 తర్వాత తాను, తన కుటుంబ సభ్యులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను అవసరమైతే బహిరంగంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నానని వజ్రేష్‌యాదవ్ తెలిపారు. తన ఆస్తుల్లో ఏదైనా భూమిని అక్రమంగా కబ్జా చేసినట్లు ఆధారాలతో నిరూపిస్తే, ఆ భూమిని పేదలకు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. ఈ విషయంలో తాను ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.తనపై ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డికి కూడా ఇదే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఆరోపణలు చేయడం సులువేనని, వాటిని ఆధారాలతో నిరూపించడం ముఖ్యమని అన్నారు. భూకబ్జాలకు సంబంధించిన వివరాలు, పత్రాలు, ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.ప్రజలను తప్పుదోవ పట్టించొద్దుప్రజల భూములు, ఆస్తులు, హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని వజ్రేష్‌యాదవ్ అన్నారు. నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొడతామని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేని పరిస్థితుల్లో వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరికాదన్నారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ నాయకత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించకుండా వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడం మానుకోవాలని వజ్రేష్‌యాదవ్ సూచించారు. తనపై వచ్చిన ప్రతి ఆరోపణకు వాస్తవాలు, పత్రాలతో సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

# నారముల్ల వారి వివాహ వేడుకలో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు



**సంగారెడ్డి, ఆగస్టు 16, నేటి శుభోదయ :** బాచుపల్లికి చెందిన క్రీ. శే. నారముల్ల రాములు–పెంటమ్మ దంపతుల కనిష్ఠ పుత్రిక నవ్యశ్రీ, అభిషేక్‌ల వివాహ వేడుకలు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పులిమామిడి రాజును వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆత్మీయంగా స్వాగతించారు.కార్యక్రమంలో మిత్రులు సీలం సురేష్–మాధవి దంపతులు, జగదీశ్వర్ భాగ్యలక్ష్మి దంపతులు, ఉషాకిరణ్ యూత్ అధ్యక్షులు బామిని రవికుమార్, బుసరెడ్డిపల్లి వెంకటేశం, జగ్గు, సోమ శంకర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నచికేతన్ తపోవనం ఆశ్రమంలోని పదో తరగతిలో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులను అప్పగిస్తే.. వారిని ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దుతా - భాస్కర్ నాయక్



**మిడ్జిల్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** కొడ్గల్‌లోని నచికేతన్ తపోవనం ఆశ్రమంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర వేడుకలకు భాస్కర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తి, విద్య, సేవా విలువలపై విద్యార్థులకు సందేశం ఇచ్చారు.అయితే ఈ కార్యక్రమంలో భాస్కర్ నాయక్ చేసిన ఒక ప్రకటన అందరి దృష్టిని ఆకర్షించింది. ఆశ్రమంలో చదువుతున్న ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులు భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్‌లో రాణించి IAS అధికారులుగా ఎదగాలనే లక్ష్యంతో చేస్తున్న చదువుకు అయ్యే ఖర్చును తాను భరిస్తానని ఆయన ప్రకటించారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల లక్ష్యాలకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**విద్యార్థుల కలలకు ఆర్థిక భరోసా**

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధం కావాలంటే ఉన్నత స్థాయి విద్యతో పాటు కోచింగ్, పుస్తకాలు, స్టడీ మెటీరియల్, వసతి తదితర అంశాలకు గణనీయమైన ఖర్చు అవుతుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ ఖర్చులు పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరు విద్యార్థుల IAS లక్ష్యానికి అండగా నిలుస్తానని భాస్కర్ నాయక్ ప్రకటించడం అభినందనీయం."ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి తన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉండాలి. ఆర్థిక పరిస్థితుల కారణంగా వారి చదువు ఆగిపోకూడదు. దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలనుకునే విద్యార్థులకు నా వంతు సహకారం అందిస్తాను" అనే సందేశంతో ఆయన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు.స్వాతంత్ర్య దినోత్సవానికి స్ఫూర్తిదాయక సందేశంస్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదని.. ప్రతి ఒక్కరికీ విద్య, సమాన అవకాశాలు, ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు కల్పించడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.ఆశ్రమ విద్యార్థులతో భాస్కర్ నాయక్ ముచ్చటిస్తూ వారి చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో సమాజానికి, దేశానికి గొప్ప సేవలు అందించగలరని పేర్కొన్నారు.

**సేవా భావానికి మరో నిదర్శనం**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేవలం అతిథిగా వచ్చి కార్యక్రమంలో పాల్గొనడంతో పరిమితం కాకుండా.. ఇద్దరు విద్యార్థుల ఉన్నత విద్యా లక్ష్యానికి ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించడం సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమాజంలోని దాతలు, సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

**IAS లక్ష్యంతో ముందుకు**

నచికేతన్ తపోవనం ఆశ్రమంలోని ఆ ఇద్దరు విద్యార్థులు భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. వారి లక్ష్యానికి భాస్కర్ నాయక్ అందించిన ఆర్థిక భరోసా వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని విద్యార్థులను ఆయన కోరారు.స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండా నీడలో విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా తీసుకున్న ఈ నిర్ణయం ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికుల నుంచి ప్రశంసలు అందుకుంది. ఒక విద్యార్థి కలను సాకారం చేయడానికి అందించే చేయూత.. భవిష్యత్తులో ఒక కుటుంబానికే కాదు, సమాజానికే దిశానిర్దేశం చేయగలదనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

## సుప్రజ హాస్పిటల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన హాస్పిటల్ ఎండీ శిగ విజయ్ కుమార్ గౌడ్



**నాగోల్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** నాగోల్‌లోని సుప్రజ హాస్పిటల్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ శిగ విజయ్ కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తి స్ఫూర్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, యాజమాన్య ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ఆలయ అభివృద్ధికి దాతృత్వ హస్తం..

### - లక్ష రూపాయల విరాళం



**కేశంపేట, ఆగస్టు 16, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం భైర్ఖన్‌పల్లి గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి గోరింటా నరసింహ శర్మ లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గోరింటా నరసింహ శర్మను అభినందించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు ముందుకు వచ్చి అందిస్తున్న సహకారం అభినందనీయమనీ పేర్కొన్నారు. భక్తుల సహకారంతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తి భావంతో దాతలు అందిస్తున్న విరాళాలు ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు అన్నారు.ఈ కార్యక్రమంలో భైర్ఖన్‌పల్లి గ్రామ నాయకులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్, డిప్యూటీ సర్పంచ్, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. నరసింహ శర్మ చేసిన సేవను పలువురు ప్రశంసిస్తూ, ఇతర దాతలు కూడా ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు.

## కేశంపేటలో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



**కేశంపేట, ఆగస్టు 16, నేటి శుభోదయ :** కేశంపేట మండల కేంద్రంలో సంఘసంస్కర్త, విద్యాదాత రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు ఆదివారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేశంపేట మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు తలసాని రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేశారు.అనంతరం తలసాని రంగారెడ్డి మాట్లాడుతూ,,, రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి సమాజ అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని కేశంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సేవలను నేటి తరానికి తెలియజేయడానికి విగ్రహం స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి బీస కరుణాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎన్నం శ్రీధర్ రెడ్డి, తాండ్ర శ్రవణ్ రెడ్డి, గోగు వెంకట్ నారాయణ రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బండ రాజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్‌లు బుర్రి భూపాల్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, యారం భాస్కర్ రెడ్డి, తలసాని మోహన్ రెడ్డి, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, పోచారం జగన్ రెడ్డి, వేముల నర్వ ఆనంద్ రెడ్డి, కోడ్పర్తి శ్రీకాంత్ రెడ్డి, ఎన్నం శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ప్రజావాణి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ**
- **మండల ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి**

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి అర్జీలు సమర్పించే ప్రజల సౌకర్యార్థం ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశ్యంతో నేటి నుండీ (ఆగస్టు 17వ తేదీ నుంచి) ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణితో పాటు, ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు.మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను మండల స్థాయిలోని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

### - అధ్యక్ష కార్యదర్శులు కొండ్రు భాస్కర్, ఆలంపల్లి జంగయ్య



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** యాచారం మండలం కేంద్రంలోఆగస్టు 23న జరిగే డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ యాచారం మండలం కమిటీ ఆధ్వర్యంలో మహాసభలు కరపత్రం విడుదల చేయడం జరిగింది,ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు కొండ్రు భాస్కర్ ఆలంపల్లి జంగయ్య మాట్లాడుతూ, విద్య ఉపాధి పోరాటాల సారధి ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా మహాసభలు ఆగస్టు 23న యాచారం మండల కేంద్రంలో ఉన్న ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ జరిగే మహాసభకు జిల్లా నలుమూలల నుండి 300 ఎంపిక చేయబడిన యువజన ఉద్యమ నాయకులు ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు.అందరికీ విద్య ఉపాధి నినాదంతో భగత్ సింగ్ వారసత్వ స్ఫూర్తి యువతి యువకుల ఎదుర్కొంటున్న సమస్యల పైన నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కానీ అంటూ కులమత విచ్ఛిన్నకర రాజకీయ స్వాధ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ దేశ సమైక్యత కొరకు నిరంతరం ఉద్యమిస్తామన్నారు. అదేవిధంగా నేడు యువత ఎక్కువ చెడు అలవాట్లకు బానిస అవుతున్నారు.యువత చైతన్యం కోసం డివైఎఫ్ఐ నిరంతరం పనిచేస్తుందని అన్నారు డ్రగ్ గంజాయి మత్తు పాన్యాలకు దూరంగా ఉండాలని అన్నారు.ఈ మహాసభల జయప్రదం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కంబాలపల్లి చరణ్ మస్కు రూపేందర్ సదానంద్ పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై దాడి దుర్మార్గం

- **బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి**
- **యుఎస్ఎఫ్ఐ, పిడిఎస్ యు, జివిఎస్ విద్యార్థి సంఘాలు డిమాండ్**





**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల (ట్రైబల్ వెల్ఫేర్) పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు మద్యం మత్తులో దాడికి పాల్పడటం అత్యంత విచారకరం. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు జి మస్తాన్, జీవీఎస్ విద్యార్థి సంఘం నాయకులు బాలాజీ నాయక్ లు మాట్లాడుతూసీనియర్ల వేధింపులు, దాడులు తాళలేక భయంతో 10వ తరగతి విద్యార్థులు రాత్రంతా సమీపంలోని అడవిలో తలదాచుకోవాల్సి రావడం పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గురుకులంలో విద్యార్థులకు కనీస రక్షణ లేకుండా పోయిందని, మద్యం మత్తులో దాడులు జరుగుతున్నా వార్డెన్ మరియు ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపించడం సిగ్గుచేటు.ఈ ఘోర ఉదంతాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో యుఎస్ఎఫ్ఐ, పిడిఎస్ యు , జివిఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది.విద్యార్థులపై దాడికి పాల్పడిన బాధ్యులపై మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలి. మద్యం సేవిస్తూ దాడులకు తెగబడిన వారిపై, విధి నిర్వహణలో విఫలమైన వార్డెన్,ప్రిన్సిపాల్ బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలి. దాడికి గురై తీవ్ర భయాందోళనకు గురైన 10వ తరగతి విద్యార్థులకు తగిన ధైర్యం చెప్పి, ప్రత్యేక వైద్యం మరియు కౌన్సెలింగ్ అందించాలి.పాఠశాలలో విద్యార్థుల భద్రతపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు మరియు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## విధుల నిర్లక్ష్యంపై అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్...జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని/పెద్దపల్లి, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఓదెల–II అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న జె. ప్రమీలను విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో లోపాలు, ప్రభుత్వ సేవల అమలులో నిర్లక్ష్యం తదితర ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కోయ శ్రీహర్ష తెలిపారు. అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న జె. ప్రమీల విధుల నిర్వహణకు సంబంధించి పలు ఆరోపణలు పేర్కొన్నట్లు కలెక్టర్ తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందించాల్సిన సేవల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు, ముందస్తు సమాచారం లేకుండా అంగన్వాడీ కేంద్రాన్ని మూసివేసినట్లు తెలిపారు.ఆరోపణల తీవ్రత, లబ్ధిదారుల ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వ సేవలు నిరంతరాయంగా కొనసాగాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, విషయం పూర్తిగా పరిశీలించబడే వరకు జె. ప్రమీలను అంగన్వాడీ సేవల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.సస్పెన్షన్ కాలంలో ఓదెల–II అంగన్వాడీ కేంద్రం సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత సూపర్వైజర్ అందుబాటులో ఉన్న అంగన్వాడీ టీచర్‌కు కేంద్రం పూర్తి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీవో, సంబంధిత సూపర్వైజర్ ఉత్తర్వులను తక్షణమే అమలు చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, గుడ్లు, ఇతర సంక్షేమ సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అంగన్వాడీ సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

## జీసీసీ భూముల ఆక్రమణలను అరికట్టాలి..

### - రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్..



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కు కేటాయించిన ప్రభుత్వ భూముల ఆక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఇళ్ల స్థలాలు లేని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు.జీసీసీ ఏర్పాటైన 1965లో భద్రాచలం తహసీల్దార్ కార్యాలయం ద్వారా పాత సర్వే నంబర్ 121లో తొలుత 4.5 సెంట్లు, అనంతరం అవసరాల మేరకు మొత్తం 4 ఎకరాల 50 సెంట్ల భూమిని కేటాయించినట్లు నాయకులు తెలిపారు. ఇందులో 1.40 ఎకరాల్లో జీసీసీ భవనాలు నిర్మించగా, మిగిలిన భూమి ఖాళీగా ఉందన్నారు.1965 నుంచి 2000 మధ్య సుమారు 1.60 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. వివాదం నేపథ్యంలో 2011 జూన్ 2న ఐటీడీఏ అధికారులు పంచనామా నిర్వహించి మిగిలిన 2.83 ఎకరాలను జీసీసీ అధికారులకు అప్పగించారని చెప్పారు. 2017 జనవరి 18న భద్రాచలం ఎమ్మార్వో కూడా సదరు భూమి జీసీసీకి చెందినదేనని నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు.కోట్లాది రూపాయల విలువైన ఖాళీ స్థలాన్ని తాము కొనుగోలు చేశామంటూ కొందరు గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో తహసీల్దార్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, మండల సర్వేయర్లు జోక్యం చేసుకుని ఆధారాలను పరిశీలించి ఆక్రమణలను అడ్డుకున్నారని తెలిపారు.1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఇళ్ల స్థలాలు లేని ఆదివాసీ పేదలకు దక్కాల్సి ఉండగా, ధనబలం, అధికారుల అండతో అన్యాక్రాంతం చేయడం దుర్మార్గమని నాయకులు మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ప్రజాప్రతినిధులు స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు.భూమిని రక్షించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం సదరు స్థలంపై 'స్టేటస్ కో' అమల్లో ఉందని, వివాదం పరిష్కారమయ్యే వరకు ఇరు వర్గాలూ భూమిలోకి వెళ్లరాదని తహసీల్దార్ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జీసీసీ భూములను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుని, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.

## ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు




**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం కు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కవి రచయిత  పంజాల ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత  అవార్డు 2026 లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ  సౌజన్యంతో  ఆనందలహరి సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.సాహిత్య రంగంలో  చేస్తున్న కృషికి గాను జాతీయ సమైక్యత పురస్కారానికి ఎంపిక చేశారు. ముఖ్య అతిథులు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, వంశి ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కా ను వెంకటరమణ సినీ నటులు  జెన్నీ , ఏసిపి నరేష్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ సమైక్యత పురస్కారాన్ని అందజేశారు.ఈ సభకు వందే భారత్ మూవీ డైరెక్టర్ మల్లం రమేష్ అధ్యక్షతన  జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డుతోపాటు ప్రశంస పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

## ఎంపీడీవో కార్యాలయం ఎదుట  చెత్తాచెదారం



**ఏన్కూర్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కాంప్లెక్స్ చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు, గతంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించిన అనంతరం వాటి కొమ్మలు, చెట్ల అవశేషాలను అక్కడే పడేసి వెళ్లిపోయారు. చెత్తాచెదారం, చెట్ల వ్యర్థాలు రోజురోజుకూ పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజలు రాకపోకలు సాగించే కార్యాలయం ఎదుటే ఈ పరిస్థితి నెలకొనడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తాచెదారం, చెట్ల అవశేషాలు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

## భద్రాచలం సరస్వతి శిశు మందిర్‌కు దాతల అండ

### - గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యానికి పెద్దపీట

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో విద్యా కమిటీ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానాలు, విద్యార్థుల సంక్షేమం, దాతల సహకారం గురించి వివరించారు.పాఠశాలలో ప్రస్తుతం 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వారిలో 90 శాతానికి పైగా మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన నిరుపేద గిరిజన విద్యార్థులేనని దుర్గాప్రసాద్ తెలిపారు. వారికి నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత విలువలను అందించడమే పాఠశాల లక్ష్యమన్నారు.రూ.65 లక్షలతో నూతన భవనంగిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమెరికాకు చెందిన ఎస్2టెక్ ఐటీ సంస్థ అధినేత దయాకర్ రూ.65 లక్షల సొంత నిధులతో పాఠశాలకు నూతన భవనం నిర్మించి అందించారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన ఈ భవనం ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని  కల్పిస్తోందన్నారు.గోశాలతో  పౌష్టికాహారంవిద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని దుర్గాప్రసాద్ తెలిపారు. మరో దాత సహకారంతో పాఠశాల ఆవరణలో గోశాలను ఏర్పాటు చేసి ఆవులను సమకూర్చినట్లు చెప్పారు. దేశవాళీ ఆవుల నుంచి లభించే స్వచ్ఛమైన పాలను విద్యార్థులకు



నిత్యం అందిస్తున్నామన్నారు.పౌష్టికాహారం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు రోగనిరోధక శక్తి, మేధో వికాసానికి దోహదపడుతోందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల విద్య, సంక్షేమానికి సహకరిస్తున్న దాతలు దయాకర్‌తో పాటు గోశాల దాతలకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించాలని పాకాల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు.

## భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్ మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :**
విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన మృతి, చివరి రోజుల్లో ఎదుర్కొన్న పరిస్థితులపై సమగ్రంగా చర్చిస్తూ "ఓ భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్" పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగింది. చంద్రశేఖర్ సహచరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు వివిధ విప్లవ, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన జీవితం, ఉద్యమ ప్రస్థానం, మృతి చుట్టూ నెలకొన్న సందేహాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. చంద్రశేఖర్ మృతిని కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా ఆయన సుదీర్ఘ విప్లవ ప్రస్థానం, ఉద్యమంలో ఎదుర్కొన్న ఒత్తిళ్లు, చివరి దశలో చోటుచేసుకున్న పరిణామాలపై లోతైన సమీక్ష అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

**- "మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయి"**

సభలో మాట్లాడిన పలువురు నాయకులు రాయల చంద్రశేఖర్ మృతిపై ఇప్పటికీ అనేక ప్రశ్నలు, అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన మృతి వెనుక వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలంటే సమగ్ర విచారణ అవసరమని డిమాండ్ చేశారు.
ఐఎఫ్టియు జాతీయ ఉపాధ్యక్షులుపీ. ప్రసాద్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఏడు ప్రాంతాల్లో తిరుగుతూ విప్లవోద్యమంలో పనిచేశారని, ఆయన మృతిపై మైక్రో, మ్యాక్రో స్థాయిల్లోనూ విచారణ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయన ఉద్యమ జీవితంలోని వివిధ దశలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు.

**- "50 ఏళ్ల విప్లవోద్యమంలో డీ-క్లాసిఫికేషన్ జీవితం"**

సతీష్ చందర్ మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ దాదాపు 50 సంవత్సరాల విప్లవోద్యమ జీవితాన్ని కొనసాగించారని, డీ–క్లాసిఫికేషన్ జీవితం గడిపిన వ్యక్తిగా ఆయన ప్రస్థానాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తిని బలహీనమైన పరిస్థితులకు నెట్టివేసే పరిస్థితులకు ఎవరు కారణమయ్యారనే అంశాన్ని కూడా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**- మాస్‌లైన్ పార్టీ వైఖరిపై ప్రశ్నలు**

చంద్రశేఖర్ చివరి దశలో ఎదుర్కొన్న మానసిక పరిస్థితులపై కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను ప్రదర్శించారు. మాస్‌లైన్ పార్టీతో ఆయనకు ఏర్పడిన విభేదాలు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, ఆయనను మానసికంగా కృంగదీసిన పరిస్థితులపై ప్రజెంటేషన్‌లో వివరించినట్లు సభ నిర్వాహకులు తెలిపారు.
రాయల చంద్రశేఖర్ సహచరి రాయల విమల మాట్లాడుతూ తనపై, తన భర్తపై వివిధ రకాలుగా నేరస్తులుగా ముద్ర వేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను, చంద్రశేఖర్ చివరి రోజుల్లో చోటుచేసుకున్న పరిణామాలను సమాజం ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**- "కమ్యూనిస్టులంతా ఒక్కటై ఆలోచించాలి"**
కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని  సాంబశివరావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ మృతి విచారించదగినదని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి చెందిన వారంతా విభేదాలను పక్కనపెట్టి ఒకటై ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. రానున్న కాలమంతా కమ్యూనిస్టులదేనని పిడిఎస్‌ఈ నుండి వచ్చిన ఎందరో పెద్దపెద్ద పదవులకు ఉద్యోగాలకు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు

**- "మృతి చెందిన నాటి నుంచి అపోహలు"**
సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ మరణించిన నాటి నుంచి అనేక రకాల అపోహలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. సభలో విడుదల చేసిన ఆడియో ద్వారా ఈ వ్యవహారానికి సంబంధించి కొన్ని అంశాలు స్పష్టమయ్యాయని పేర్కొన్నారు. వాస్తవాలను నిర్ధారించేందుకు సమగ్ర పరిశీలన జరగాలని అన్నారు.

**- "పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి"**
ఏకేఎంఎస్ జాతీయ నాయకులు వేములపల్లి వెంకటరామయ్య




మాట్లాడుతూ రాయల విమల రచించిన పుస్తకం మాస్‌లైన్ పార్టీతో పాటు విప్లవ పార్టీలన్నింటినీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రశ్నిస్తోందన్నారు. ఉద్యమంలో పనిచేసిన వ్యక్తుల జీవితాలు, వారి కుటుంబాలు ఎదుర్కొన్న సమస్యలపై రాజకీయ సంస్థలు బాధ్యతగా సమీక్షించుకోవాలని సూచించారు.మధు మాట్లాడుతూ చంద్రశేఖర్ మృతి తర్వాత కూడా ఆయన కుటుంబంపై దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మాస్‌లైన్ పార్టీ తన వైఖరిపై సమీక్షించుకోవాలని, తమకు ఎలాంటి తప్పు లేకపోతే ఈ సభకు హాజరుకాకపోవడానికి కారణమేంటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు.

**- "ఆత్మహత్యా? హత్యా? వాస్తవాలు వెలుగులోకి రావాలి"**
సభలో కొంతమంది వక్తలు రాయల చంద్రశేఖర్ మృతిని "ఆత్మహత్యగా కాకుండా హత్యగా అనుమానించాల్సిన పరిస్థితులు ఉన్నాయి" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి తుది నిర్ధారణ రావాలంటే స్వతంత్ర, సమగ్ర విచారణ అవసరమని వారు పేర్కొన్నారు.చంద్రశేఖర్‌ను బలహీనమైన పరిస్థితుల్లోకి నెట్టివేసిన కారణాలు, ఆయన ఎదుర్కొన్న మానసిక ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత పరిణామాలు, కుటుంబంపై వచ్చిన ఆరోపణలు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని సభలో పలువురు డిమాండ్ చేశారు.

**- విప్లవోద్యమంలో చంద్రశేఖర్ పాత్రపై స్మరణ**
రాయల చంద్రశేఖర్ జీవితాన్ని స్మరించుకుంటూ పలువురు వక్తలు ఆయన వివిధ ప్రాంతాల్లో పనిచేసిన విధానాన్ని, ఉద్యమానికి అంకితమైన జీవితాన్ని గుర్తుచేశారు. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి ఉద్యమానికే ప్రాధాన్యతనిచ్చిన ఆయనలాంటి కార్యకర్తల జీవితాలను చరిత్రలో నమోదు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.పుస్తకావిష్కరణ సభ కేవలం ఒక పుస్తకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంగా కాకుండా, రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన ఉద్యమ ప్రస్థానం, కుటుంబం ఎదుర్కొన్న పరిణామాలు, మృతి చుట్టూ నెలకొన్న అనుమానాలపై బహిరంగ చర్చకు వేదికగా మారింది.

**- నిజాలు వెలుగులోకి రావాలన్న డిమాండ్**
చంద్రశేఖర్ మృతిపై ఎవరి ఆరోపణలు నిజమో, ఎవరి వాదనల్లో వాస్తవం ఉందో తేల్చాల్సింది సమగ్ర విచారణ ద్వారానేనని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలకు అతీతంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆయన కుటుంబానికి న్యాయం జరగాలని, విప్లవోద్యమంలోని సంస్థలు తమ వైఖరిని పునఃసమీక్షించుకోవాలని నాయకులు కోరారు.రాయల చంద్రశేఖర్ జీవితం, మృతి చుట్టూ కొనసాగుతున్న చర్చకు ఈ పుస్తకావిష్కరణ సభ మరోసారి తెరతీసింది. ఆయన మృతి వెనుక అసలు వాస్తవాలు ఏమిటన్నది సమగ్రంగా వెలుగులోకి రావాలంటే నిష్పాక్షిక విచారణే కీలకమనే అభిప్రాయం సభలో బలంగా వినిపించింది. ఈ కార్యక్రమంలో ఎస్పాల్ సృజన అజయ్ మనోజ్ బృందం అనేక విప్లవ గేయాల ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసించిన వారు సిపిఐ పార్టీకి చెందిన భాగం హేమంతరావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం కు చెందిన బొంతు రాంబాబు,  ఐఎఫ్టియు జాతి నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు పోటు కళావతి, పి ఓ డబ్ల్యు నాయకురాలు ఝాన్సీ, గౌరీ,పశ్య పద్మ, పీవీ శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్, కే వై రామచంద్రరావు, న్యూ డెమోక్రసీ నాయకులు గౌని ఐలయ్య, బండారు ఐలయ్య, ప్రముఖ కవి జీవన్ సార్, తదితరులు పాల్గొనగా ఈ కార్యక్రమానికి రాయల చంద్రశేఖర్ అభిమానులు భక్త రామదాసు కళాక్షేత్రం లో పెద్ద ఎత్తున చేరుకోగా ఆయనకు ఘనమైన నివాళులర్పించారు.


Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# ఆగస్టు 17 నుంచి మండల స్థాయిలోప్రజావాణి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని/పెద్దపల్లి, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దర ఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు అందజే యాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నందున, తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దర ఖాస్తులను సంబంధిత అధికారులు పరి శీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్య క్రమంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.



# సాంకేతిక హంగులతో "సరస్వతి శిశు మందిర్ "కు సరికొత్త శోభ





**భద్రాచలం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఆదివాసీ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీస్తూ వారిని అన్ని రంగాల్లో ఉన్నతులు గా తీర్చిదిద్దే లక్ష్యం తో సరస్వతి శిశు మందిర ముందుకు సాగు తున్నది. విద్యకు సాంకేతిక హంగుల్ని జోడించి భవిష్యత్ తరాలను మేటి పౌరులు గా రూపొందించే కృషి శిశు మందిరం లో కొనసాగుతున్నది. విద్య, సాంకేతిక నైపుణ్యం, నైతిక క్రమశిక్షణ లక్ష్యం గా శిశు మందిరం ను నడుపు తున్నారు. భద్రాచలం లోని సరస్వతి శిశు మందిరం పేద ఆదివాసీ విద్యార్థులకు బోధనా వసతి కల్పిస్తోంది. ప్రముఖ ఐటీసీ కాంట్రాక్టర్, సామాజిక సేవాతాత్పరులు పాకాల దుర్గా ప్రసాద్ పర్యవేక్షణ లో శిశు మందిరం అభివృద్ధి పథం లో నడుస్తున్నది. పలువురు దాతలను సంప్రదించి అనేక వస తులను, సాంకేతిక సొగసు లను ఏర్పాటు చేసేందుకు దుర్గా ప్రసాద్ నిత్యం చేస్తున్న కృషి ప్రశంసనీయం. కార్పొరేట్ పాఠశాలల వసతుల్ని సరిపోల్చే లా గిరిజన విద్యార్థులకు ఉన్నత మైన ఉచిత విద్యను అందించడమే తమ లక్ష్యం అని దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. శిశు మందిరం అధ్యక్షులు గా ఉన్న దుర్గా ప్రసాద్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పాఠశాల ప్రగతి నీ వివరించారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక క్రమశిక్షణ నేర్పు తున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం 150 మంది విద్యార్థులు ఉన్న శిశు మందిరం ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రవాస భారతీయులతో పాటు , పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ లాబ్స్ లాంటి అన్ని రకాల ఆధునిక సాంకేతిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలోనే గోశాల ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన ఆవు పాలు, పెరుగు అందిస్తు న్నామని ఆయన చెప్పారు. ఇటువంటి సౌకర్యం ఉన్న ఏకైక పాఠశాల భద్రాచలంలోని సరస్వతి శిశు మందిర మాత్ర మేనని ఆయన అన్నారు.ప్రవాస భారతీయులు దయాకర్, శ్రీకాంత్ తో పాటు ఐటీసీ సహకారంతో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 60 లక్షల రూపాయలతో డిజిటల్ తరగతి గదులు, కోటి రూపా యలతో కంప్యూటర్ ల్యాబు లు, గోశాల నిర్మాణం చేసినట్లు తెలిపారు. సరస్వతి శిశు మందిర్ లో 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకూ 150 మంది విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఉచిత విద్య, వసతి అందిస్తున్నట్లు తెలిపారు. 500 మంది విద్యార్థులకు సరిపడా వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుకున్న వారు ఇప్పుడు ఉన్నత స్థానంలో ఉన్నారని, విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, సాంస్కృతిక నృత్యం, సైన్స్ లో ప్రావీణ్యత పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటాచారి, ప్రధానో పాధ్యాయురాలు గీత పాల్గొన్నారు.

# ఆదిభట్ల సర్కిల్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన.**
- **ఇబ్రహీంపట్నం బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి బంగారుగళ్ల మహేందర్.**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్ 15 గ్రామం.కొంగరకలన్ డివిజన్ 54 మండలం ఇబ్రహీంపట్నం పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 ఆగస్టు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రధా నోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది.విద్యార్థిని విద్యార్థులకు 500 నుంచి 560 మార్కులు సాధించిన,10 మంది విద్యార్థులకు 560 మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి 4000 రూపాయలు చొప్పున 500 మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 2000 రూపాయలు మరియు తల్లిదండ్రులను శాలువతో సత్కరించి మెమోటోస్ మనీ ప్రైజ్★బి ఎస్ పి నాయకులు మాజీ వార్డ్ సభ్యులు కాకి.రవీందర్ ముదిరాజ్ ఇవ్వడం జరిగింది.రిటైర్డ్ టీచర్ లక్ష్మారెడ్డి 560 మార్కులు సాధించిన ఇద్దరి విద్యార్థులకు ఒక్కొక్కరికి 3000 రూపాయలు శాలువాతో సత్కరించి మని ప్రైజ్ ఇవ్వడం జరిగింది.రిటైర్డ్ టీచర్ లక్కరాజు రవీందర్ సార్ గారు 560 మార్కులు సాధించిన ఇద్దరి విద్యార్థులను శాలువాతో సత్కరించి మెమోటోస్ ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలోఅమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత రెడ్డి.బిజెపి నాయకులు ఆదిబట్ల మున్సి పాలిటీ మాజీ అధ్యక్షులు శీగ.వీరస్వామి గౌడ్ ముద్దం శంకర్ గౌడ్,అండేకర్ శివాజీరిటైర్డ్ టీచర్ శ్రీనివాస్ ,బహుజన్ సమాజ్ పార్టీ, ఇబ్రహీంపట్నంనియోజకవర్గం ఇన్ ఛార్జి బంగరిగళ్ళ మహేందర్,ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ యువకులు గ్రామ ప్రజలు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పలు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత శెట్టి

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం నగరా నికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సుంకరి శ్రీనివాసరావు-స్వరూప రాణి దంపతుల కుమారుడు సాయి కిరణ్ భూమిక ల వివాహ వేడుక ఖమ్మం నందు గుర్రం జగ న్మోహన్ రావు ఫంక్షన్ హాల్ నందు ఆదివారం జరిగింది. అదే విధంగా ముత్యాల గోవర్దన్ స్వప్న ప్రియుల కూతురు అపూర్వ నూతన వస్త్రాలంకరణ వేడుక మారెమ్మ గుడి ఏ ఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగింది.ఈ శుభ కార్యక్రమాలకు హాజరయ్యి చిరం జీవులను ఆశీర్వదించిన మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ జిల్లా నాయకులు శెట్టి రంగారావు, మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ తదితరులు పాల్గొన్ని ఆశీర్వాదం తెలిపారు.



# ఆకట్టుకున్న అక్షయ ఆహాభావాలు



**షాద్నగర్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** కమనీయమైన ఆహా భావాలతో అక్షయ ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తెలంగాణ తల్లికి వందనం భరతమాతకు అభివందనం అంటూ 80వ స్వాతంత్ర వేడుకలు పురస్కరించుకొని తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్ ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో చిన్నారులతో నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షాద్నగర్ పట్టణానికి చెందిన నాట్య నివేదాలయం గురువు భార్గవి శిష్యురాలైన అక్షయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వందనీయ జనని ఓ భారతి అనే గానం పై ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. నందిత, తేజశ్రీ, యుక్త, ప్రణవి, కల్పన, స్నేహ, సాయి సుదీక్ష, తను, ఆద్వితీ, చార్విని మొదలగు చిన్నారులు తమ నృత్యాలతో పలువులి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువు భార్గవి, చిన్నారులను మేమెంటో, ప్రశంసా పత్రాలతో సత్కరించి అభినందించారు.

# శిక్షణ నకు హజరైన నూతి

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (సర్ ) ఫేజ్ 2 పై టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ అధ్యక్ష తన గాంధీభవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు,ని యోజకవర్గ కో ఆర్డినేటర్ లకు జరిగిన శిక్షణా తరగతులకు హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గాంధీభవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు,నియోజ కవర్గ కో ఆర్డినేటర్ లకు సర్ ఫేజ్ 2 పై శిక్షణా తరగతులు నిర్వహించారని, సర్ ప్రక్రియలో ఫేజ్ 2 ను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని బూత్ లెవెల్ ఏజెంట్లను, బూత్ లెవెల్ ఇంచార్జీలను అప్రమత్తం చేయాలని దిశా నిర్దేశం చేశారని, అదే విధంగా 17 న ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేసి 18 న గ్రామ పంచాయతీ లలో అందుబాటులో ఉంటాయని బూత్ లెవెల్ ఏజెంట్లు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, పాత ఓటర్ జాబితా లో ఓటు లేని ఓటర్లు వారి తల్లిదండ్రుల,పూర్వీకుల వివరాలు అందించిన వారి ఓట్లను జాబితాలో చేర్చేవిధంగా దొంగవోట్లను చేర్చకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, జిల్లా లోని బూత్ లెవెల్ ఏజెంట్లకు టి పి సి సి లో సుశిక్షితులైన శిక్షకులచే శిక్షణా తరగతులు నిర్వహిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.



# ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ న్యాయవాది పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెదిరే వేణుగోపాల్ రెడ్డి జన్మదిన జన్మదిన వేడుకలు.

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ న్యాయవాది పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెదిరే వేణుగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకల, సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి వెదిరే వేణు గోపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ,అంతటి రాజు గౌడ్, ప్రజాగలం భూపాల్ ఈ సందర్భంగా వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ,ఆరుట్ల గ్రామానికి చెందిన న్యాయవాది వెదిరె వేణు గోపాల్ రెడ్డి ఇబ్రహీంపట్నం ని యోజకవర్గం ప్రజలకు రాజకీయ పార్టీల నాయకులకు పెద్దలకు మంచి పరిచయం ఉన్న వ్యక్తి ప్రతి ఒక్కరిని పేరు పెట్టి ఆప్యాయంగా పలకరించే న్యాయవాది మంచాల మండలంలో ఏదైనా గొడవలు జరిగి పోలీసు కేసులు అయితే ముందుగా గుర్తుకొచ్చే న్యాయవాది వెదిరె వేణుగోపాల్ రెడ్డి అన్నారు. వేణుగోపాల్ రెడ్డి న్యాయవాది వృత్తిలో ఇంకా ఎదిగి రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా కావాలనికోరుకున్నారు.ఈకార్య



క్రమంలో రెడ్డి దండు హన్మంత్ వెదిరె,నర సింహారెడ్డి భగవంతు రెడ్డి,హరి రెడ్డి,పాండాల నరసింహగౌడ్, దూసరి రాజు గౌడ్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రతి సోమవారం ప్రజావాణి

## - ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్

**మిడ్జిల్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల నంబర్ 4 మేరకు తొలి ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 15న సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని 24 శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఎంపీడీవో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

## - జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఆగస్టు 17న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించా రు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపా రు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులు వెంటనే స్వీకరించి, వాటిపై తగిన చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలోనూ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# ఈసం ముచ్చరాజు దశకర్మలకు హాజరైన కోరం సురేందర్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం పెట్రాం చెలక గ్రామానికి చెందిన ఈసం ముచ్చరాజు ఇటీవల మృతి చెందగా, ఆయన దశకర్మ కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్ హాజరయ్యారు. ముచ్చరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ల పోశాలు, ఎర్రాయిగూడెం సర్పంచ్ ఊకే రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు సర్దార్ జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థిపై వేధింపులు..

## - బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**వికారాబాద్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం లోని ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసి, చపాతీలు కాల్చే కర్రతో వాతలు పెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు.కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మల్కయ్య మాట్లాడుతూ, విద్యార్థిని తోటి విద్యార్థులు పలుమార్లు ఇబ్బందులకు గురిచేసినా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు రాగా, వారిని లోపలికి అనుమతించకుండా గేటుకు తాళం వేయడం జరిగిందని తెలిపారు. పోలీసులు పాఠశాలకు వచ్చిన సమయంలో కూడా గేటు మూసివేసి లోపలికి అనుమతించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గత నెలలోనే కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలో సర్వే నిర్వహించి పలు సమస్యలను గుర్తించి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని అన్నారు. విద్యార్థులతో ప్రతి ఆదివారం చపాతీలు చేయించడం, వంట పనులు చేయించడం వంటి చర్యలు చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. పాఠశాలలో సీనియర్లు జూనియర్లను వేధించడం, ర్యాగింగ్‌కు పాల్పడటం, రాత్రి వేళల్లో విద్యార్థులు బయట తిరగడం వంటి అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు.జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే గురుకుల పాఠశాలను తనిఖీ చేసి పూర్తి స్థాయి విచారణ నిర్వహించి విద్యార్థుల భద్రతకు భంగం కలిగించే పరిస్థితులకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు



తీసుకోవాలని మల్కయ్య డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే కేవీపీఎస్, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జెండా ఆవిష్కరణ..



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** టేకులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, శ్యాంబాబు, ఊకే శేఖర్‌రావు, సంతులాల్, హేమ్‌చందర్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎదులాపురంలో ఘనంగా ముత్యాలమ్మ వేడుకలు

**డప్పు కొట్టిచ్చిందేసిన సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు--- పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు**

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాపురంలో శ్రావణ మాస ముత్యాలమ్మ బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయి సెంటర్ నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు బోనాలతో ర్యాలీగా తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు, ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో సీపీఐ 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి స్వయంగా డప్పులు వేసి ఉత్సాహం నింపారు. 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ డప్పుల దరువులకు చిందులేస్తూ వేడుకల్లో సందడి చేశారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు సైతం డప్పులు కొడుతూ ర్యాలీలో పాల్గొనడంతో పరిసర ప్రాంతం సందడిగా మారింది. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ర్యాలీగా తరలిరావడంతో ముత్యాలమ్మ ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. ఈ ప్రాంత చరిత్రలోనే మొట్టమొదటి సారిగా పెద్ద ఎత్తున తరలి రావడం ఓరి ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందంటూ వారు పేర్కొన్నారు.

**--- 28వ వార్డులో ఘనంగా**

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో శ్రావణమాసం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తీర్థ ప్రసాదాలను సమర్పించి, భక్తులు స్వీకరించారు. సంప్రదాయ ఆచారాల్లో భాగంగా జంతు బలి కార్యక్రమం కూడా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి నామస్మరణతో వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు సందడిగా, భక్తిశ్రద్ధల మధ్య కొన సాగాయి.

# వర్షాలతో .. మిర్చి నాట్లు ప్రారంభం



**ఏన్కూర్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల వ్యాప్తంగా మిర్చి నాట్లు జోరందుకున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షంతో పొలాల్లో తేమ, పదును ఏర్పడటంతో మిర్చి మొక్కలు నాటేందుకు భూములు అనుకూలంగా మారాయి. దీంతో శ్రీరామ్ గిరి తో పాటు మండల వ్యాప్తంగా రైతులు పొలాలను సిద్ధం చేసుకుని నాట్ల పనులను వేగవంతం చేశారు. సకాలంలో వర్షం కురవడంతో సాగు పనులకు ఎంతో ఊతం లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూముల్లో తేమ ఉండటంతో మొక్కలు నాటిన తర్వాత వాటి ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు ఆశిస్తున్నారు. వాతావరణం ఇదే విధంగా సహకరిస్తే మిర్చి పంట మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** దేశ జనాభాలో సగ భాగానికి పైగా కలిగిన యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం చింతల వినయ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు సిపిఐలో చేరారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలీ సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ముఖ్యంగా ఉపాధి కల్పన రంగాలపై వివక్ష ప్రదర్శిస్తున్నార న్నారు. –నైపుణ్యత కలిగిన యువతకు సైతం ఉపాధి దొరకడం లేదని నైపుణ్యత లేని వారు ఏదో ఒక రకంగా ఉపాధి పొందెందుకు ప్రయత్నిస్తుంటే

పాలకులు రకరకాల చట్టాలతో బతక లేని పరిస్థితిని సృష్టిస్తున్నారని హేమంతరావు తెలిపారు. మోడీ –అధికారం లోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా యావత్ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టి –దేశాన్ని ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు ఎదురు లేదనుకుంటున్న మోడీని ఈ దేశ –యువశక్తి మెడలు వంచిందని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటంతో మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని ఆయన తెలిపారు. రాజకీయాల్లో అవినీతిపై యువత భగ్గుమంటున్న సమయంలో యువతకు –మద్దతుగా నిలుస్తూ యువజన పోరాటాల్లో పాలు పంచుకున్న సిపిఐలో యువకులు చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని హేమంతరావు తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ –భృతి, ఉద్యోగాల కల్పన విషయంలో ఆడిన మాట తప్పిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక డిక్లరేషన్లు ఇచ్చిందని ఏ డిక్లరేషన్ను అమలు చేసే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సిపిఐ ఇటీవల జన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా ఉద్యమాలకు నూతన జవసత్వాలను తీసుకు వచ్చిందన్నారు. చింతల వినయ్ సహా పార్టీలో చేరిన –వారందరిని సిపిఐ సగర్వంగా ఆహ్వానిస్తుందని హేమంతరావు తెలిపారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు ప్రసంగించగా ఆహుతులను హవేలీ సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల –మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబ శివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్, విజయ్, రాకేష్, పవన్, రాజు, కిషోర్,కిరణ్, రంజిత్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి సిపిఐ లోకి ఆహ్వానించారు.



# పరకాలలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం



**వరంగల్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** హనుమకొండ జిల్లా పరకాలలో ఆదివారం సీఎం రేవంత్ పర్యటిస్తున్నారు. పరకాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. రూ.484 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం పరకాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. పరకాల స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేశారు.

**వరంగల్ పోరాటాల గడ్డ: సీఎం రేవంత్ రెడ్డి**

వరంగల్ పోరాటాల గడ్డ అని,ఈ ప్రాంతంలో ప్రజలకు చైతన్యం, ఆలోచన ఉందని సీఎం రేవంత్ అన్నారు. ఆదివారం పరకాలలో సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తనను, మంత్రులను అనేకసార్లు కలిశారని, ఆయన వల్లే అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు దేవుళ్లుగా భావిస్తే ప్రజలే వారిని గొయ్యితీసి పాతిపెడతారని హెచ్చరించారు. చిన్న వయసులోనే యశస్విని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారని ప్రశంసించారు.

**ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తాం**

కేసీఆర్ పాలనలో ఒక్క మహిలకు కూడా పదవి ఇవ్వలేదని సీఎం రేవంత్ విమర్శించారు.'మా ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాం. నిరుద్యోగులను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తాం. విడతల వారీగా నియామకాలన్నీ చేపడతాం. మాయమాటలు నమ్మితే మోసపోతారు. రెచ్చగొట్టాలి.. శవాల పునాదులపై నుంచి అధికారంలోకి రావాలన్నదే వారి ఆలోచన' అని అన్నారు.

**సొంత చెల్లినే ఇంటి నుంచి గెంటేశాడు**

ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కేటీఆర్ సొంత చెల్లినే ఇంటి నుంచి గెంటేశాడని సీఎం రేవంత్ ఆరోపించారు.సొంత చెల్లికి న్యాయం చేయలేని వాడు రాష్ట్రంలోని మహిళలకు న్యాయం చేస్తాడా? అని అన్నారు. ఇక యువత ఇంగ్లిష్తో పాటు జపనీస్, జర్మన్, కొరియన్ భాషలు నేర్చుకోవాలని, ఇందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగవకాశాలు వస్తాయని చెప్పారు.కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విప్ రామచంద్ర నాయక్,ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,పోరిక బలరాం నాయక్,కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య,ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,గండ్ర సత్యనారాయణ రావు,నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయ్యూబ్, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్, ఎర్ర ప్రియాంక పులి అనిల్ కుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్, చాహత్ బాజ్ పాయ్, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి,పరకాల ఆర్డిఓ డి వెంకన్న,ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు మండల అధ్యక్షులు అధికారులు పాల్గొన్నారు

# ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం గిరిప్రసాద్భవన్లో ఏఐఎస్ఎఫ్ నగర సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కల్పన వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గానీ పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందినీ ఆయన అన్నారు.పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను ఉప సవరించుకోవాలన్నారు. లేని ఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ పవన్, కొమరం మహేష్, సాయి చరణ్, గోపి, నరేందర్, పవన్, కార్తీక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వను ఆశీర్వదించిన ఆకుల,శీలంశెట్టి



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం తదితరులు చిన్నారి అపూర్వకు తమ ఆశీస్సులు అందజేశారు. ముత్యాల గోవర్ధన్ –స్వప్నప్రియ దంపతుల ముద్దుల తనయ అపూర్వ పట్టు వస్త్రాలంకరణ వేడుక (ఓణీల అలంకరణ) ఆదివారం ఖమ్మం జిల్లా రెడ్డిపల్లిలో కొలువైన మారమ్మ గుడి దగ్గర ఏ.ఆర్.గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు గాంధీ, వీరభద్రం తదితరులు హాజరై అక్షింతలు వేసి అపూర్వను ఆశీర్వదించారు.ఆమె తల్లిదండ్రులు గోవర్ధన్–స్వప్నప్రియ, వారి కుటుంబ సభ్యులకు గాంధీ, వీరభద్రంలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# భూమి కోసం వృద్ధురాలి పోరాటం

## -వెల్జాల్ బొజ్జమ్మ కు న్యాయం జరిగేనా!



**తలకొండపల్లి, ఆగస్టు 16, నేటి శుభోదయ :** అక్రమంగా భూమి పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని,బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు.బాధితురాలి ఆవేదన:గ్రామానికి చెందిన ఆయిల్ బొజ్జమ్మ (భర్త వెంకటయ్య) తమ వారసుల భవిష్యత్తు కోసం ఎలాంటి స్వార్థం లేకుండా శేఖర్ గౌడ్, రవి గౌడ్లకు సాగు నిమిత్తం పొలాన్ని అప్పగించారు.కొందరు వ్యక్తులు అక్రమ మార్గాల్లో ఈ భూమిని తమ పేరిట పట్టా చేయించుకున్నారని ఆమె ఆరోపించారు.ప్రస్తుతం ఈ భూమి అసలు బాధితుల పేరిట లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని,తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ భూమిని తమకు ఇప్పించాలని,బాధితుల పేరిట పట్టా నమోదు చేయాలని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.భూ బాధితురాలు బొజ్జమ్మకు వెల్జాల్ గ్రామ ప్రజలు,యువకులు,పెద్దలు పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా గ్రామ వార్డు సభ్యుడు అనిల్ గౌడ్ మాట్లాడుతూ..అక్రమంగా పట్టా చేసిన భూమిని వెంటనే రద్దు చేసి,బాధితుల పేరిట నమోదు చేయాలని డిమాండ్ చేశారు.న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసేది లేదని,నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో గ్రామంలో ఎవరికి ఇలాంటి అన్యాయం జరిగినా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలంతా న్యాయం వైపు నిలబడి బాధితులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఉన్నతాధికారులు విచారణ జరపాలి:ఈ భూ వ్యవహారంపై రెవెన్యూ (ఎమ్మార్వో), పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు."న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు" అంటూ గ్రామ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు.ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్ సంగం అధ్యక్షుడు గోద జంగయ్య యాదవ్,గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుల్తాన్ టిఆర్ఎస్ రాష్ట్ర రక్షణ సేన తలకొండపల్లి మండల అధ్యక్షుడు వద్దే సాయి,అయిల్ రవి,బొమ్మ శంకరయ్య,లచ్చయ్య,అయిల్ వెంకటేష్ గౌడ్,చీపిరి వెంకటయ్య,,యుగంధర్ గౌడ్,శ్రీకాంత్, రవి, గోపాల్, ఆంజనేయులు,మధు,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాక్స్ మిలియన్ కోల్బే పండుగ



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** క్యాథలిక్ల చెరసాల పరిచర్య వ్యవస్థాపకులు మాక్స్ మిలియన్ కోల్బే పండుగను ఆదివారం స్థానిక కరుణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లా ఆర్.సి.యం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ఆదేశాల ప్రకారం చెరసాల పరిచర్య విషయాల గురించి కరుణగిరి చర్చ్ డైరెక్టర్ ఫాదర్ జ్ఞానేష్ , చెరసాల పరిచర్య కోఆర్డినేటర్ డేవిడ్ లు విశ్వాసులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరసాలలో మగ్గుతున్న ఖైదీల కోసం సంస్థ తరఫున అండగా నిలవాలని న్యాయ సలహాలను అందించి ఆ ఖైదీలు విడుదల కావడానికి తగిన న్యాయమార్గాల గురించి చర్చించారు. ఖైదీలకు సంబంధించిన బయట ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా అందించాలని వారి పిల్లల చదువులు నిరాటంకంగా కొనసాగేలా సహకరించడం గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత గురువులు, సిస్టర్స్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న కంచపోగు రాజు



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** 80వ స్వతంత్ర భారతదేశ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరిగిన సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ఐడిఓసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందు మెయింటెనెన్స్ సూపర్వైజర్ గా బాధ్యతలు సక్రమంగా నిర్వహించినందుకు గాను అవార్డు అందుకుంటున్న కంచపోగు రాజు. త్వరలో దళితరత్న అవార్డుకు కూడా ఎంపిక చేసేఅవకాశాలు కంచపోగు రాజు ఉన్నాయి. గతంలో పీ గౌతమ్ కలెక్టర్ చేతుల మీదుగా మొదటిసారి, రెండోసారి ముజుల్ ఖాన్ ఐఎస్ ఆఫీసర్ చైర్మన్గా మూడవసారి దురిశెట్టి అనుదీప్ కలెక్టర్ వారి చేతుల మీదుగా డిప్యూటీ సీఎం శ్రీమల్లి భట్టి విక్రమ్ మరియు ప్రస్తుత కలెక్టర్ ఖమ్మం జిల్లా కలెక్టర్ టి ఎస్ దివాకర్ ఐఎఎస్ సమక్షంలో మీదుగా తీసుకోవడం జరిగింది.

## తులజా భవాని షిప్ & గోట్ ఫార్మ్ అండ్ మీట్ షాప్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్



**నాగోల్, ఆగస్టు 16, నేటి శుభోదయ :** నాగోల్ అరుణోదయ నగర్, రోడ్ నెం.9, ధోబీఘాట్, ఈదమ్మ దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన తులజా భవాని షీప్ & గోట్ ఫార్మ్ అండ్ మీట్ షాప్ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాణ్యమైన మేకలు, గొర్రెల పెంపకం మరియు ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని, నిర్వాహకులు శ్రీ భరత్ కుమార్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వినయ్ మరియు బిజెపి నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, శరన్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ పేరుతో మోసం చేస్తున్నాడని జెరషా లేం హౌస్ ఆఫ్ వర్షిప్ చర్చి ముందు ట్రస్ట్ మెంబర్స్ ఆందోళన



**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :** ఖమ్మం వెంకటేశ్వర నగర్ జెరషా లేం హౌస్ ఆఫ్ వర్షిప్ చర్చి ముందు సంగస్తులు మరియు ట్రస్ట్ మెంబర్స్ ఆందోళన చేపట్టారు . గత 30 సంవత్సరాలుగా అదే మందిరంలో సంఘస్తులుగా ఉన్నారని 2005 నుండి 5 గురు ట్రస్ట్ మెంబర్స్ ద్వారా నడిపించడం జరుగుతుందని దీంట్లో పాస్టర్ సత్యవేదం ని చైర్మన్ గా పెట్టుకుంటే మిగతా నలుగురు ట్రస్ట్ మెంబర్స్ గా ఉన్నామని మమ్మల్ని మోసం చేసి , చందా డబ్బులు లెక్కలు చెప్పకుండా , నలుగురు ట్రస్ట్ మెంబర్స్ కి తెలియకుండా 2024 న సెప్టెంబరు 10న దొంగ డాక్యుమెంట్ ను పాస్టర్ సత్యవేదం చేయించుకున్నారని ఆరోపించారు . ఆయన భార్య రుతు , ఆయన కొడుకు జాన్ కలిసి ట్రస్ట్ మెంబర్స్ కి తెలియకుండా దొంగ డాక్యుమెంట్ చేశారు . అప్పటి నుండి మమ్మల్ని మందిరం లోనికి రానివ్వకుండా గొడవలు చేస్తున్నారని ట్రస్ట్ మెంబర్స్ వాసమల్ల మనోహర్ , విజయరాజు , ఏ ఐజయా , బహాటం వీర రాఘవరాజు , ఎంద్రపూడి మధు లు పేర్కొన్నారు . మేము హై కోర్టు నుండి ఆర్డర్ తెచ్చుకొని మందిరం లోకి పోతుంటే మమ్మల్ని అడ్డుకుని గేట్ తాళాలు వేసి మందిరం లో ఉన్న ఆడవారిని మా మీదకు ఉసుగోల్పుతున్నారు . కోట్ల రూపాయలు పాస్టర్ దొంగతనం గా కొడుకు పేర్ల మీద చేసుకున్నారు అవి బయటపడకుండా ఈ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు . అలాగే 2024 సెప్టెంబర్ 10వ తారీఖున అక్రమంగా చేసుకున్న డాక్యుమెంట్ కొడుకు ఆయన కలిసి బ్యాంక్ అకౌంట్ తీసి వాళ్ళిద్దరూ ట్రాన్సాక్షన్ చేయడం జరుగుతుంది . ఇవన్నీ మాకు తెలిసి మేము అడిగితే ఆరోజు మొదలుకొని మమ్మల్ని చర్చిలోనికి రానికుండా ఆరాధనలు మరియు ప్రార్థనలు రానీయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు . మెంబర్స్ గా తీసేసి వారు మమ్మల్ని కొట్టడానికి చర్చిలో ఉన్న లేడీస్ ని ముందు పెట్టి మమ్మల్ని చర్చిలోనికి రానీయకుండా దగ్గర దగ్గర 18 నెలల నుంచి చర్చికి రానీయకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారు . చర్చిలోకి మమ్మల్ని కూడా ఆరాధనకు రానివ్వాలి సంఘమునకు సంబంధించిన ప్రతి ఒక్క రూపాయిని లెక్క చెప్పాలని పత్రిక ముఖంగా కోరారు .

## తిరుమలాపురంలో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

**ఖమ్మం, ఆగస్టు 16, నేటి శుభోదయ :**
ఖమ్మం జిల్లా, చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా, డ్రైనేజీ కాలువల చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో దోమల బెడద పెరుగుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు గుర్తించారు.దీంతో వెంటనే స్పందించిన సర్పంచ్ గ్రామంలోని రోడ్ల ఇరువైపులా, డ్రైనేజీ కాలువల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామం మొత్తం పరిధిలో పిచ్చి మొక్కలపై కలుపు మందు పిచికారీ చేయించారు.దోమల వృద్ధికి కారణమయ్యే పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు, గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్



తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజీ కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని ఆయన కోరారు.

## మీన్స్ మెంటల్ హెల్త్ కేర్ సర్వీస్ ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**నాగోల్ మెట్రో స్టేషన్, ఆగస్టు 16, నేటి శుభోదయ :**
మీన్స్ మెంటల్ హెల్త్ కేర్ సర్వీస్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్. జె. ఎస్ థామస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొత్తపల్లి సామ్యూల్ జాన్ మీన్స్ మెడికల్ ఎడ్యుకేషన్ నేచర్ సర్వీస్ వ్యవస్థాపకులు జ్ఞాన ప్రకాష్, భాను, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ...ఎంతోమంది స్వతంత్ర సమరయోధుల ప్రాణ త్యాగాల ఫలితంగా భారత కు స్వతంత్రం సిద్ధించిందన్నారు. ఈ సందర్భంగా హెల్త్ కేర్ సెంటర్ లోని సభ్యులకు ఆయన 80 స్వాతంత్రం శుభాకాంక్షలు తెలియజేశారు. గత 30 సంవత్సరాల నుండి మానసిక వ్యాధిగ్రస్తులను ఎంతోమందిని మామూలు మనిషిలు గా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఎంతోమంది సమాజ సేవ దృక్పథం కలిగిన సేవకులు మా



సంస్థను ఆదుకున్నారని, దానిలో ఆర్ జె ఎస్ థామస్ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు.ప్రభుత్వాన్ని విధాల మానసిక వ్యాధిగ్రస్తుల ఆదుకోవాలని దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం హోం లో ఉన్న మానసిక వ్యాధిగ్రస్తులకు మిఠాయిలు పంచారు.

## గాజులరామారంలో శ్రీ నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం

**గాజులరామారం, ఆగస్టు 16, నేటి శుభోదయ :**
గాజులరామారంలో శ్రీ నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మేడ్చల్–మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ గారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, కిరణ్,



వెంకటస్వామి, రవి, జ్ఞానేశ్వర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యాము సాగర్, మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.


Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620